తపు విలువ గ్రహించాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను!”

ఈ మాటలు నా కెంత సంతృప్తి కలిగినవో చెప్పలేను. నా జీవితమంతా తెలుసుకుని బాగా నన్ను ప్రేమించి నన్ను గౌరవించగలిగితే, యిక కావల్సిన దేముంది? “నిజముగానా?” అని అడిగాను.

“నిజము శోభా! నిజము... యిక నీవు నా దానివి... సరేనా?” అన్నాడు.

“ఎన్నాళ్ళకి నాజీవితంలో ఓ ఆశారేఖ కనిపించింది. డాక్టరుగారూ మృత్యువుకి సిద్ధమయిన నన్ను బ్రతకడానికి ఆశకల్గిస్తున్నారు. జీవితంలో సారధిని చాలా ఆలస్యముగా చూచాను. ఏం లాభము? ఏం ప్రయోజనము? బ్రతకవలెనన్నా, యింక బ్రతకలేను. పోనీ చచ్చిపోయే ముందయినా నన్ను అర్థం చేసుకొని ప్రేమించగలిగిన వ్యక్తినొక్కరినయినా చూశాను. నా మరణానికి బాధపడేవాళ్ళు, నేనులేకపోతే వెలితిగాభావించే వారిని పొందగలిగాను. అదే నాకు తృప్తి! నా జీవితము సార్థకమయినది చిట్ట చివరకు!

---

క థా ని క

# ఇదీ జీవితం

నా. రామనాధ్

దుమ్మునూ - ముళ్ళపొదలనూ చీల్చుకుంటూ- మలుపులు తిరుగుతూ పోతున్న రోడ్డు పోయి పోయి - చివరికి ఒక చెలమ వద్ద అంతమైపోయింది. దానిఒడ్డునే - నిద్రించే పహారా జవానులా - నీరసంగా ఓ మామిడిచెట్టు. చెట్టుక్రింద జీవితపుతుది నిశ్వాసను విడుస్తూ ఓ అభాగ్యజీవి. ఒక కాలు మడచి రెండో కాలు జలాశయంలోకి జార్చాడు. చేతులురెండూ బారచాచివున్నయ్. ఊహాతీతమైన శక్తియేదో తనతో తొలిసారిగా - బహుశా అదే తుదిసారికూడాను - దాగుడుమూతలాడటంచూచినపుడు తాను పొందిన సంభ్రమాశ్చర్యాది అనుభూతులు ఆ కళ్ళల్లో ముద్రితమై - ఇంకా ఆ భావాన్నే వ్యక్తంచేస్తున్నయ్. మృత్యుదేవతతో పోరాడుతూ అంతిమ క్షణాల్లో అతను-

బారెడు ప్రొద్దెక్కింది. నలువైపులనుండీ చీమలు బారులుబారులుగా వచ్చి మృత్యదేహంపై ప్రాకుతూ వీలయిన ప్రతిచోటికీ— నేత్రాల్లోకీ- ముక్కులోనికి - కర్ణరంధ్రముల్లోకి చొచ్చుకుని పోతున్నవి. కలతచెందిన నీడలు తారట్లాడుతున్నయ్. ఇంతలోకే పసిబాలుడు ఒకడు బంతి ఆడుకుంటూ ఆదారికి వస్తున్నాడు. ఉన్నశక్తినంతటినీ కేంద్రీకరించి బంతినితన్నాడు. ఉవ్వెత్తుగా - తారజువ్వలా బంతిపైకి ఎగిసింది జారే బంతినిచూస్తూ కేరింతలుకొడుతూ చేయిచాచాడు. కొద్దిలో పట్టుతప్పిపోయి ఎగురుతూ ఎగురుతూ- దొర్లుతూ - దొర్లుతూ - మట్టిదిబ్బ వెనుకకు జారి అదృశ్యమైపోయింది. దాన్ని అనుసరిస్తూనే కుర్రాడు - శవాన్ని - దాంతో ఆటలాడుకుంటున్న చీమలసమూహాన్ని చూచాడు. ఓక్షణం ప్రశాంతం-ఆ వెను వెంటనే భయంతో సానుభూతిపూర్వకంగా ఓ కేక అతని పెదవులనుండిజారింది. తను వచ్చినదారినే అరచుకుంటూ అరచుకుంటూ అ ర చు కుం టూ — ఒ క్కొ క్క ళ్ళే రావటం ఆరంభించారు. దేహంచుట్టూ గుమిగూడి, అతను చనిపోవటానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఇంతలోకే ఒకడు బండీ తోలుకువచ్చాడు. అంతా కలసి మృతదేహాన్ని బండిపైకి ఎక్కించి తోలుకుపోయారు. జనం సర్దుకున్నా, ఇంతవరకూ మౌనంగావున్న పక్షులు కిచకిచమని మాట్లాడుకోవటం ఆరంభించినయ్. గాలివీయగానే చెట్టు ఆకులు బాధాపూరిత నిస్వనం విడిచినవి. అప్పుడప్పుడూ గుసగుసలాడే పక్షి పిల్లలు-అన్నిచోట్లా ప్రశాంతత ఆవరించింది.

అన్నిచోట్లా చీకటి—

కాలవాహిని సాగిపోతోంది. శిథిలావస్థలో వృద్ధ తల్లివృక్షం తననొకసారి చూచుకుంది. కొన్నిచోట్ల కత్తిగాట్లు - కొన్నిచోట్ల చెదలు లేపూడివచ్చినయ్. తను ప్రతివసంతములోనూ చిగుర్చి పుష్పించి, మరో వసంతాగమనంకోసం ఎదురు చూచేది. యుగాయుగాలుగా గతితప్పకుండా తాను యీ కథనాన్ని నిర్వహిస్తోంది. అనంత కాలంనుంచి తనగర్భంలో చోటుచేసుకుని జనించి పెరిగి పెద్దవాళ్లు కాగానే తనను వీడి-తనకు ఎడమై పోతున్న తన పత్ర-పుష్ప-ఫల-సంతాన సంచయాన్ని చూచి తల్లి విలపిస్తూ కన్నీలు కార్చింది. ధారావాహినిగా వచ్చే ఆ కన్నీటిని ఆపుకొనే ప్రయత్నంలో వ్రేళ్ళనే భూమిలోనికి గుచ్చి నిలద్రొక్కుకుంది, ఆ వ్రేళ్ళే శాశ్వతంగా భూమిలోనికి చొచ్చుకొనిపోయి మునివ్రేళ్ళనల్లుకుంటూ పోతోంది. కాని తాను కార్చేకన్నీరే సంతరించబడి తనక్రింది జలాశయమైంది. ఏ తుఫాను దెబ్బకో తాను పడిపోయేవరకు—లేకా ఏ మానవ హస్తమో తన్ను ఛేదించేవరకూ తన సర్వస్వాన్ని అర్పించుకుంటూ పుష్పిస్తూ—తిరిగి పుష్పిస్తూ, ఫలిస్తూపోవలసిందే, తనకు పూర్తిగా తెలుసు. తన హృదయాంతరాళంలోని కోరికకూడా అదే. అందుకనే అనుక్షణము నీడలా మృత్యువు వెన్నాడే ఈ జీవిత పునరుజ్జీవనకు—నవవికాసానికి మృత్యువునే చిరునగవుతో ఆహ్వానించమంటుంది. చెలమ గట్టుపై ప్రేమమూర్తిలా వృద్ధవనితలా గంభీరంగా నిలబడి తనదరికిచేరే ప్రతి మానవ, మృగ పక్ష్యాదులకు తన సర్వస్వాన్ని సమర్పించుకొంటూ ఈ జీవన నాటకరంగంలో తాను ఒక పాత్రధారిగా నెలకొనియున్నది. తననుండి- తన చుట్టూ పరివ్యాపితమైన రెమ్మలు, కొమ్మలు, పువ్వులు, కాయలు-తన సంతానము.

అసంఖ్యాక పుష్పసంచయం - ముద్దుల పూలబాలలు. సూర్యుని లేతకిరణాల్ని మలయమారుతపు చిరు వీవనలను, సయితం భరించలేని ముగ్ధలు-కోమలులు. పూవుల్లోకల్లా పూవు-అందాల బరిణలా మెరిసిపోయే ఓకన్నియ. ఓ మధురక్షణాన ఎచటనుండో మలయమారుతం కొనివచ్చిన సుగంధ పుష్పరజాన్ని అత్యంత ఆప్యాయంతో ఆహ్వానించింది-ఆస్వాదించుకుంది. తన్ను తిరస్కరించలేదు-తన మధుర మనోహర రూపము చిలికిపోతుందిగాని-ఇందుమూలంగా తన గర్భాశయం మరింత పెద్దదవుతూ భవిష్యత్తులో ఒకనాడు మృత్యువునే చిరునవ్వుతో ఆహ్వానించవలసి వస్తుందిగాని, ఆ భావనకు-ఆ భయానికి హృదయంలో స్థానమివ్వక నిండు హృదయంతో పుష్పరజాన్ని ఆహ్వానించింది. రోజుకురోజూ తనలో ఏదో కదలిక. తన రూపమే మారిపోతూంది. రంగు కూడాను. తన చుట్టూ తనను రక్షిస్తూ పత్రత్రయము, సోదరులు ఎందుకీ వికాసము? ఏల నీ పరిణామము? తనకు రూపురేఖలు దిద్దటంలో తల్లి ముస్నెన్నడూ చూపని శిల్పనైపుణ్యము చూపింది. మామిడిచెట్టు దాని చిన్నారి పాప.

కాలచక్రం తిరుగుతోంది. తెలిమంచులో జలకమాడి బంగారపు రేకు తొడిగింది, ఆ తేజోపుత్రిక. తన శరీరమంతటా మిలమిలలు-నునుపు-నూతన వికాసము-తనలో మధుర రసాల-తనలో ఏదో తనకు తెలియని అనుభూతి. విస్పష్టమైన కదలిక. తనలోనే మరో ప్రాణి కదలాడుతోంది తొలి క్షణాల్లో ఈ కదలికకు అర్థమే తనకు గోచరించలేదు. అది దీర్ఘనిద్రనుండి మేల్కొంచటం, గాఢ అగాధ తపస్సునుండి తేజోలోకాల్లోకి పయనించటం. తన చుట్టూ విశాలంగా పరుచుకొన్న అనంత విశ్వంలోకి నిగూఢ రహస్యలోకాల్లోకి తొలిచూపును సారించడం.

తూర్పు కొండనుండి దూసుకొని, తనే ఓ కాంతివంతమైన ఫలంలా ప్రకాశిస్తూ సూర్యుడు ప్రసరించిన శతసహస్ర కిరణాల్లో ఒకటి రెండు తనను తాకి స్వర్ణకాంతితో తనను ఉద్దీపంచేసినవి. ప్రొద్దెక్కినకొద్దీ ఓ కొలిమిలా మారిపోయి ఈ విశ్వపు రూపురేఖల్ని దిద్దుతున్నాడు సూర్యుడు. సాయంత్రం అవుతోంది. పగలెల్లా తాను వినోదంగా ఆడిన క్రీడల్ని చూసుకొని తనకే నవ్వు వచ్చింది గాబోలు. చల్లగా, మెల్లగా పశ్చిమ దిశను సూర్యుడు జారుకొంటున్నాడు. కరుణామయిలా శీతలవాయువులతో రాత్రి ఏతెంచింది. అన్నిచోట్లా ప్రశాంతత-అగాధంగా విశాలంగా ఎల్లెడలా చీకటి. ఈ నిశా సమయంలోనే తనచుట్టూ ఆవరించుకొన్న వృక్ష

సంతతి మరింత సజీవవంతుగా వెలిగిపోయేది. అప్పుడప్పుడు అర్థవంతంగా ఆకుల గలగల ప్రతి పొదకూ చేరుతూ ఏవో రహస్యసందేశాలను విని పిస్తూ మిణుగురు పురుగులు నీలాకాశంలో మేఘ మాలికలు రంగుల్ని తుదకు తమ ఆకారాల్ని మార్చుకొంటూ కొన్నికొన్ని సమయాల్లో సూర్య చంద్రులతోనే దోబూచులాడుతూ—ప్రకృతి పుత్రికలు. జీవితంలో తను చూచిన ఈ దృశ్యాలకీ, ఈ సంపదకీ, ఈ ఆనందానికీ, ఈ కదలికకీ అర్థం ఏమిటి? ఒకరోజున ఉల్లాసంతో గంతులువేస్తూ పిల్లలు కొందరు తన తల్లి దగ్గర చేరారు. తనను గురిచూచి ఓకొంటె కుర్ర వాడు రాయి విసిరాడు. తను ఆ కులచూటుకి తిప్పు కుంది. ఆరాయే తిరిగివచ్చి మరోకుర్రవాడి నుదుటికి తగిలింది. ఎర్రగా మిలమిలా మెరిసిపోతూ రక్తం. అలాంటిదే తనలో వ్యాపించి సతతం ప్రవహిస్తూ తనకు ఉత్సాహ ఉత్తేజాల్ని కలిగిస్తూంది ఏమో!

ఓ సాయంకాలము దంపతులిద్దరు తన తల్లి మొదట్లో చేరారు. తన కర్థంకాని భాషలో ఏవేవో గుసగుసలాడటం ప్రారంభించారు. చీకటి ఆవహిస్తున్న కొద్దీ ఒకరికొకరు మరింత దగ్గరగా జరుగసాగారు - మెరుపులాతేచి జవ్వని పురుష కంఠం కౌగలించుకొంది. చీకటి మరింత దట్టమైంది. ఆకులను ఒత్తిగించి తనెంత కన్ను పొడుచుకొన్నా ఏమి కనపడటంలేదు. ప్రభాత సమయంలో తను లేచిచూస్తే ఎవ్వరూలేరు. వాళ్ళేమయారు? తన శరీరమంతా సూది ములుకులతో గుచ్చినట్టు బాధ. అకస్మాత్తుగా తను అర్థంచేసుకోలేని మధురాతి మధురమైన బాధ-బాధ.

"అమ్మా!..."అంది నిస్పృహాయంగా చెలిస్తూ. తను పంపిన ఆ కేక తల్లి వృక్షపు అన్నిశాఖలకు పరివ్యాపితమైపోయింది. తల్లి కంఠం మూగవోయింది. తల్లీ కన్నీరు కార్చింది-జలాశయంలోకి పతనమయ్యే మంచు బిందువుల్లా.

"నాకన్నా" అంది తల్లి.

"అమ్మ..." అంది చిట్టితల్లి.

"............"

"పలకవేమమ్మా?"

"ఏంలేదు చిట్టితల్లీ. మృత్యువు నీకు ఆసన్నమౌతోంది."

"అంటే...?"

"మరేమి కాదు. నానుండి శాశ్వతంగా విడిపోయి విముక్తి పొందుతావు."

"ఈమాత్రానికేనా అమ్మా! ఎవ్వరు నీనుండి నన్ను విడదియ్యలేరు. కన్నీరు కార్చకు."

"చిట్టితల్లీ! ప్రపంచంలో మరెవ్వరూ మృత్యువుని తిరస్కరించలేరమ్మా. ఏనాటికైనా పుట్టిన మనం గిట్టవలసిందే. కాని—ఈ లోపుగనే జీవితాన్ని సార్థక్యం చేసుకోవాలి. నీసార్థకతకోసమే నేనిలా కుమిలిపోతున్నాను."

ఈ బాష భావము తనకేమీ అర్థంకాలేదు. అమాయకంగా"ఏమిటుంటావమ్మా?"అని అడిగింది.

సమాధానంగా తల్లి నిట్టూర్చింది. మృత్యువు—పరిపూర్ణత—సార్థకత ఈ పెద్దపదాలకు తనకు అర్థం తెలియదు. కాని తల్లిచెప్పిన ఆ క్షణం కోసమే తను ఎదురు చూచింది. తన శరీరమంతటా వ్యాపించిన బాధ ఇపుడు తనహృదయంలో కేంద్రీకృతమైంది. తనే కరిగిపోతూ రుచులు మార్చుకొంటూ హృదయాంతరాళాల్లో వెలిగే జ్యోతికి తైలంలా సురిగిపోతూంది. తన తుది క్షణం కోసం ఆ మధుర క్షణంకోసం ఎదురు చూస్తూ జాగారం చేస్తూ.

ఆ క్షణం రానేవచ్చింది. ఒకరోజున అనంత దిక్చక్రంలో ఓ చోటినుండి —ఓ జ్యోతి—సూర్యకాంతినంతటినీ తనలో కేంద్రీకరించుకొని తనవైపే తేలియాడుతూ-ఎర్రగా-నీలిగా-పచ్చగా పసుపుపచ్చగా రంగులను మార్చుకొటూ వచ్చింది. తనను సమీపిస్తున్నకొద్దీ ఓ పక్షిలా ఓ చిలకలా మారిపోయింది. సున్నితమైన ఓ రెమ్మపై తన కత్యంత సమీపంలోనే ఆశీనుడైన అగంతకుణ్ణి చూచి తనహృదయమే ఏలకోపెల్లుబికింది. ఆకుల మాటునదాగి అతని సుందరాకృతిని తనివితీర ఆస్వాదిస్తోంది. అతడు మాత్రం తనను గమనించనేలేదు. దీర్ఘంగా గర్వంతో మెడనుచాచాడు. అటుఇటు కలయచూచాడు — తనజన్మ తరించింది. సూదుల్లా చీల్చుకుపోయే అతనిచూపే తనవైపు- ఆ చూపుల్లో ఛాలెంజి- ఆశ - ఆకలి- భయంతో బరువుగా వొణికిపోయింది. ఆ క్షణంలో కాలము

తుదకు ఈ ప్రకృతే ఒణికిపోయినట్లనిపించింది తనకు. ఒక్కుదుటుతో తనముందే వ్రాలాడు- ఇంతకాలము తనను పరిరక్షిస్తూ తనపై పరచుకొన్న పత్రాలే - కన్నియముసుగులా తొలగింపబడినవి—ఏ రెమ్మ తనకు తనతల్లికీ ఇంతకాలంగా అనురాగ బంధనాన్ని ఏర్పరచిందో— మాతృహృదయపు మాధుర్యం ఏ సాధనంద్వారా తనలోకి ప్రవహించిందో— ఏ రెమ్మ ఆధారంగా తాను పెరిగి పెద్దదై యవ్వనంలో రూపురేఖల్ని దిద్దుకుందో—దానినుండే శాశ్వతంగా విడివడి అతని పాదాలకడ వ్రాలిపోయింది.

జీవితంలో తొలిసారిగా పొందిన ఈ మధురానుభూతికి ఏదీ సాటిరాదు—తనను దగ్గరగా మరింతదగ్గరగా తీసికొంటున్నాడు- హృదయానికి హత్తుకొంటున్నకొద్దీ తనలోతను ఊహించలేని రుచిరతరంగాలు—తనశరీరాన్నంటినీ స్పృశిస్తూ-లాలిస్తూ—ముద్దులాడుతూ— ఈ ఆనందాన్నంతటినీ తను ఒక్కతే—భరించలేదు — మున్నెన్నడూ కనీవినీ ఎరుగని కాంతిగోళాలు తనముందు మెరిసిపోతున్నాయి. పదునుగా వొంపు తిరిగిన ముక్కు—తనలోనికే చొచ్చుకొని ఇన్నాళ్ళూ తాను గుప్తముగా దాచుకొంటున్న అమూల్యంగా యెంచుకొంటున్న జీవనమాధుర్యాన్నే క్రోలుతున్నాడు. శరీరమంతా జలదరించింది. హృదయమే ఝల్లుమన్నది—ఈ జలదరింపులో—ఈ బాధలో—ఈ తన్మయతలో— ఈ ఆత్మార్పణలో తను స్పృహను కోల్పోకూడదని విశ్వకళ్యాణానికి—సౌభాగ్యానికి దోహదంజరిగే ఈ మధుర మహోజ్వల మహోత్సవంలోనేలొక్కనిభాగస్వామిగా పాల్గొని ఈ కల్యాణాన్నంతటినీ స్వీయ నేత్రాలతో వీక్షించి నిగూఢ అర్థాలను వేటినో వెదకి గ్రహించాలని ఆశించింది. కాని చుట్టూ అతివేగముగా ఆవహించుకువస్తున్న తమోవాహిని—మృత్యుదేవత నీడలు—— ఇంత చీకటిలో ఇంత బాధలోనూ జ్యోతుల్లా మెరసే అతనికళ్లు ఆకలిగొన్న ఆ నేత్రాల వెనక ముద్రితమైన భావాలను తను తేలికగా ఊహించుకొనకల్గింది. భయము, వికృతము, విచారము, అనురాగము, తృష్ణ యీ భావాల సమ్మేళన ఆ నేత్రాలలో తొణికిసలాడుతోంది.

చీకటి మరింత దట్టంగా తను మనోవీధినే కప్పి తను హృదయాంతరాళాలలోకే చొచ్చుకుపోతూంది. ఇంతకాలంగా తనుచూచి ఆనందించే సుందర ప్రకృతి అంతా మసకమసకగా సురిగి చీకట్లో లీనమైపోతూంది. ఏదీ తనకు విస్పష్టంగా కనపడడంలే - వినపడడంలే. ఆకలితో ఆశగా చూచే అతని నేత్రద్వయం తప్ప ఏదీ తన కడ్డంలేనట్టు తన లోతుల్లోకే చొచ్చుకొంటూ ఏ మధురరసంకోసమో గాలిస్తున్నాడు. ఉన్న సర్వస్వాన్నంతా గ్రోలమని అర్పించుకొన్నా ఇంకా ఆ కళ్ళల్లో తీరని నిరాశ, నిస్పృహ, భరించలేకపోయింది. చాలు జీవితమంటే ఏమిటో, జీవన సాఫల్యమంటే ఏమిటో తనకు ఆ క్షణంలో అర్థమైంది. హృదయాన్నే చీల్చి సమర్పించుకొంది. తన హృదయాంతరాళాల్ని చీలుస్తూ వెల్లువలై పొరలిపారే రసవాహినిలో తన్మయుడవుతూ తృప్తితో ఆనందంతో నూతన వికాసంతో మెరిసే అతనిని అంతకన్న మరింత కాంతివంతంగా వెలిగిపోయే అతని సుందరాకృతిని ఒక్కసారి కడసారి తృప్తితో చూచి తను పరితృప్తినొంది హాయిగా కనుమూసి వాలిపోయింది. ఇదే బాధ. ఇదే పరిపూర్ణత. ఇదే ఆత్మార్పణ. ఇదీ జీవనసాఫల్యం. ఇదీ జీవితం!

(ప్రఖ్యాత తమిళరచయిత యల్. ఎస్. రామామృతన్ కథకు అనుసరణ)

